# ఈ రోగానికి మందేమిటి?

'గురూగారూ ఇక్కడికి తీసుకొచ్చే రేమిటి' అని కించిత్ విస్తుపోయాడు రాంబాబు.

సదరు గురువుగారు- సంతోషం- సమాధానం చెప్పేడు, "భయపడకు. ఇదీ మనవాళ్ళదేలే- రా."

సంతోషంకేసి ఆశ్చర్యంగా చూశాడు రాంబాబు.

ఉదయం అప్సరా లాడ్జిలో దింపుతూ "ఇది మనవాళ్ళదే. భయం లేదు" అన్నాడు సంతోషం. ఆ తర్వాత ఇప్పటివరకూ చాలా చోట్ల "మనవాళ్ళ" నే పలకరించుకుంటూ తిప్పేడు.

సంతోషం చిద్విలాసంగా ఆలయ మహాద్వారాన్ని తోసుకుంటూ లోపలికి ప్రవేశించాడు. శిష్యుడు అనుసరించాడు.

"నేను చాలా ఫాస్ట్ బాబూ- సారీ" అన్నట్లు కిరకిర లాడుతూ గురువు వదిలేసిన స్ప్రింగ్‌డోర్ రాంబాబు ముక్కుని టక్కున చప్పిడి చేసేసింది.

నుదుట కట్టిన బొప్పిని అరచేత్తో నిమురుకుంటూ, జరిగిందేవిటో అవగాహన చేసుకోవాలని ప్రయత్నించాడు, రాంబాబు. ఈ కంగారులో కుడికాలి చెప్పు ఎడమకాలి చెప్పుతో సహాయనిరాకరణ ప్రారంభించింది. అతి కష్టంమీద కాలీడ్చు కుంటూ లోపలి కొచ్చి నిలబడ్డాడు రాంబాబు.

అక్కడంతా ఏవిటోగా వుంది. వొంటికి గుడ్డల్ని అతి కించేస్తున్న చల్లదనం వుంది. పల్చటి వెలుగో, ముదురు చీకటో తెలీని నీడలున్నై. దూరదూరంగా టేబుల్స్, వాటి చుట్టూ ఆరేసి కుర్చీలూ, వాటిల్లో రకరకాల శాల్తీలూ, వున్నై. గోడలకి అంటుకుపోయి రేచుకుక్కల్లా చూస్తున్న నలుగురైదుగురు సూట్‌వాలాలున్నారు. తెల్లటి డ్రస్‌లో ట్రేలతో అటూ ఇటూ తిరుగుతున్న సర్వర్లున్నారు.

కళ్ళు విచ్చుకుని ఐదునిముషాలు దిక్కులు చూస్తేగానీ గురువుగారి దర్శనం కాలేదు. ఆయనో స్తంభం పక్కగా టేబుల్‌ముందు పెదవులు తడుపుకుంటూ కూర్చొని వున్నాడు. కాలీడ్చుకుంటూ నడవటానికి సిగ్గేసింది రాంబాబుకి. కానీ తప్పదు మరి.

అలతిగా ఊపిరి పీల్చుకుని హంస గమనమో గజ గమనమో అంతుపట్టని అడుగులు వేసుకుంటూ సంతోషం దగ్గరి కొచ్చి అతని ఎదురు కుర్చీలో కూర్చున్నాడు, రాంబాబు.

" ఏవిటి రాంబాబూ, శోభనపెళ్ళికూతుర్లా ఏవిటా వెకిలి చేష్టలు " అని కోప్పడ్డాడు సంతోషం.

“ అదికాదు గురువుగారూ మరే... ” అని నసగడం మొదలెట్టిన రాంబాబుకి చేత్తో “ ఇక చాల్లే ” అన్న సైగచేసి పక్కన నిలబడ్డ బేరర్‌కి ఏదో ఆర్డరిచ్చాడు సంతోషం.

“ నే నెప్పుడూ ఇట్టాంటి హోటలికి రాలేదు ” సన్నగా అన్నాడు రాంబాబు. “ తెలుస్తూనే వుంది ” చిరాకు పడ్డాడు సంతోషం. రెండు నిముషాల్లో ఇలాంటి అవసరాల ఆవశ్యకతనీ, ఇవన్నీ తనకెలా విజయ సోపానాలుగా మారనున్నవో ఆ పైనాన్ని వివరించాడు సంతోషం.

ఛానెల్ మ్యూజిక్‌ని వింటూ హాలంతా కలయజూశాడు రాంబాబు.

ఆడా మగా చాలామంది వున్నారు.

అందరి చేతుల్లోనూ నాజూకైన గ్లాసుల్లో రంగుద్రవం. అందరి కళ్ళల్లోనూ చిందులు వేస్తున్న ఆనందం. అందరి మాటల్లోనూ ఆహ్లాదం. “ ఆ పెద్ద చిన్నదాని కళ్ళు చాలా అందంగా వున్నై నైస్— ” ఒక టేబుల్ వైపు చూసిన రాంబాబు మనసులో కళారాధన మొదలైంది. “ ఇక్కడి పద్ధతి కాబోలు— ” తనలో తాను అనుకున్నాననుకుంటూ పైకేఅనేశాడు రాంబాబు.

“ కల్— చిన్నగా. వినపడుతుంది ” కోపగించుకున్నాడు సంతోషం.

పదార్థాలు వచ్చినై. " తీసుకో " అన్నాడు గురువుగారు. " నాకలవాటు లేదు " అనబోతున్నాడు రాంబాబు అని సంతోషంకి తెలుసు. " ఇక్కడంతా నే చెప్పినట్టు విను. సీస్లు క్రియేట్ చెయ్యకు. బాగుండదు. మన స్నేహానికి మందుతో నాంది. మన తీర్థయాత్ర ఇప్పట్నుంచీ మొదలు " అన్నాడు.

ఆసంకల్ప ప్రతీకార చర్యలా గ్లాసందుకున్నాడు రాంబాబు. గురువుగారి మీద భక్తి శ్రద్ధలకి ప్రస్తావన జరిగిపోయింది.

గంట తర్వాత తన ముందుకొచ్చిన బిల్లుని చూసి హఠాత్తుగా నాగుపాముని చూసినట్లు అదిరిపడ్డాడు రాంబాబు.

సంతోషం సన్నగా నవ్వేడు. "మొదటి రోజుని కొంచెం లైట్‌గానే పోనిచ్చాం " సంతోషం సంతోషంగా అన్నాడు.

"నూటనలభై ఏడు లైటా" గొణుక్కున్నాడు రాంబాబు.

" నూటఏభై ఆ సాసర్లో పెట్టు " గురువాజ్ఞ.

గుండె పట్టేసింది శిష్యుడికి. కుడిచేతి వేళ్ళతో పాంట్ జేబులో నోట్లని తడివి చూసుకున్నాడు. మూగగా లేదా బాధగా లేదా ముసురుగా గురువు కళ్ళల్లోకి చూసి ఏదో చెప్ప బోయాడు. " ఫర్లే. నేనున్నాగా భయంలేదు. పైగా ఈ వూరు నిండా మనవాళ్ళు చాలామంది వున్నారు మనకేం ఫర్వాలేదు. అడుగడుక్కీ బ్యాండ్ కొట్టకు " అంటూ లేచాడు సంతోషం.

" సాహసము సేయరా ఢింభకా " అంటున్న మాంత్రికుడు గుర్తొచ్చాడు రాంబాబుకి. ఏడుపుని దిగమింగుకొని మూడు యాభైలూ సాసర్లో పడేసి లేచాడు. " నేనున్నా- విసురూ విసుగూ తగ్గించు " అని హెచ్చరించింది తెగిన చెప్పు.

" అబ్బ... ఖర్మ " అనుకుంటూ జోరు తగ్గించాడు. సిగ్గు ముంచుకొచ్చింది. జుట్టు పీక్కోందామనిపించింది రాంబాబుకి.

కడుపులో ఏదోగా వుంది. శరీరంలోని అవయవ నిర్మాణ క్రమంలో ఏదో లోపం జరిగినట్లనిపించింది.

మోకాలిలోతు నీళ్ళల్లో నడుస్తున్నట్టు ప్రాణాన్ని బుజ్జగించుకుంటూ బయట పడ్డాడు. పచ్చదైన ముక్కు స్ఫురణకొచ్చింది. ముక్కు నివురుకున్నాడు.

బయట ఆటో సిద్ధంగా వుంది. సంతోషం ఎక్కించాడో తానే ఎక్కాడో తెలీలేదు రాంబాబుకి.

ఆటో పోతోంది. రాంబాబు మనసూ, శరీరమూ, ఈ రెంటితో పాటు మాటా- గాలిలో తేలిపోతున్నై. గుర్రమెక్కటాలూ, గుర్రమెక్కించడాలూ చెప్పుకుపోతున్నాడు. జీవితాంతం గురువుకి ఋణపడి వుంటానని బాసలు చేస్తున్నాడు. సంతోషం ఎక్కడ దిగిపోయాడో రాంబాబుకి తెలీదు.

అప్సరా దగ్గర ఇరవై రూపాయలు యిస్తేనే గానీ రాంబాబుని ఆటో దిగనివ్వలేదు డ్రైవర్.

కౌంటర్ దాకా దేహాన్ని లాక్కొచ్చి "రూమ్ నెంబర్ వాన్ టూ త్రీ బీవాలియ్యాల్ది" అని ఆవులింతలో అడిగేసి స్లోమోషన్‌లో కిందికి కూలిపోయాడు రాంబాబు. బాయ్ మోసు కెళ్ళి రూమ్‌లో పడేసి కొద్దిసేపు రూమంతా కలయజూసి తన పని తాను చేసుకుని తలుపుని బయట తాళం పెట్టి వెళ్ళిపోయాడు.

ఉదయం పదిగంటలకల్లా వచ్చేశాడు సంతోషం.

రాంబాబు నిద్రయితే లేచాడుగానీ దిండ్లతో, పరువుతో కుస్తీ పడుతున్నాడు. తాను వచ్చినపనీ, జరుగుతున్న కార్యక్రమం గుర్తుకొచ్చి మనసులో మధన మొదలైంది తనకి.

బాయ్‌ని పిలిచి కాఫీ తెప్పించాడు సంతోషం. బిల్లు మీద హొట్టి సంతకం చేసిచ్చాడు రాంబాబు.

" ఇవ్వాళ నా పని చూసిపెట్టాలి " కర్తవ్యం గుర్తుకొచ్చి అడిగేడు రాంబాబు.

" అందుకేగా వచ్చింది " అని సిగరెట్ కాల్చుకుని శిష్యుడి కొకటి ఆఫర్ చేశాడు. రాంబాబు తీసుకున్నాడు. " ముందుగా నీకు ఉద్యోగం చూడాలి. అంతేగా "

" అవును. అప్పుడే ధైర్యంగా మా మావయ్య ముందు తలెత్తుకొని నిలబడి, కాలరెత్తుకుని "మావయ్యా నా కాళ్ళమీద నేను నిలబడ్డాను- ఇహ నా వసంతని నాకిమ్మ"ని ఆయన కాలర్ పట్టుకుని అడగ్గలను. "

సంతోషం బాయ్‌ని పిలిచి తనకు టిఫిన్ తెప్పించు కున్నాడు.

అతను దాన్ని ఆరగిస్తుంటే, తాను పళ్ళు తోమడం మొదలెట్టాడు రాంబాబు.

టిఫిన్ తినడం పూర్తి చేసి చెప్పాడు సంతోషం "ఇవాళ అట్నుంచీ నరుక్కొస్తాను. ఇదిగో ఇది- ఈ మహానగరంలో మంచి మంచి పొజిషన్‌లలో వున్న 'మనవాళ్ళ' లిస్టు. వీళ్ళలో నలుగురైదుగురు బిజినెస్ మాగ్నెట్స్ వున్నారు. వాళ్ళతో మొదలెడ్దాం. ఎవడో వొకడు వింటాడు, మన పరపతి సంగతి చూస్తావుగా."

రాంబాబు చాలా సంబరపడిపోయాడు. అతనికి ఉద్యోగమనే ఆపిల్ పండు టెక్నికలర్‌లో కనపడి "ఊఁ. ఇందఇంద తీసుకో. ఇపుడే సొంతం చేసుకో" అని ప్రాధేయపూర్వకంగా తనకు తానుగా తనచేతికి అందుతున్నట్టయింది. రాత్రి హోటల్లో చూసిన పెద్దచిన్నది-కళ్ళని చక్రాల్లా తిప్పుకుంటూ స్లోమోషన్‌లో తనతో చెట్టాపట్టా లేసుకుని బృందావనం మెట్లమీద చెంగు చెంగున చిందు లేస్తున్నట్టనిపించింది. ఆ వెంటనే ఆ పెద్దచిన్నదాని స్థానంలో వసంత నిలబడింది. ఆనందం పట్టలేక సంతోషాన్ని కావలించుకోబోయేడు. "ఛీ... ఛీ... ఏఁవిటీ ప్రేమ..." అని చీదరించుకుంటూ పక్కకి జరిగేడు సంతోషం.

క్షణాల తర్వాత ఓ వందిలాయిన్వు. ఆటోలకీ టాక్సీలకీ వుంటయ్. మనవాళ్ళ దగ్గరకి టాక్సీలో వెళ్తేగానీ పని కాదు- సంతోషం అడిగేడు.

"అవునవును" అని పాంటు జేబులోంచి డబ్బు తీయబోయి షాక్ తిన్నాడు రాంబాబు. అది ఖాళీగావుంది. కంగారుగా అక్కడా ఇక్కడా వెతికాడు. లేదు. "రాత్రి ఎంత ఖర్చయిందీ ?" తనను తానే అడుక్కున్నాడు.

" నా కిళ్ళీలకీ, సిగరెట్లకీ, ఆటోలకీ, హోటల్‌కీ నువ్విచ్చినది సుమారు రెండొందలు."

" అవును మరి. నిన్న సాయంత్రం మూడొందలు జేబులో పెట్టుకున్నానే... " బుర్రగోక్కోసాగేడు రాంబాబు. ఖాళీ సీలింగ్‌కేసి చూడసాగేడు.

బాయ్ టిఫిన్ బిల్లు తెచ్చాడు. రాంబాబు సంతకం పెడుతూ— "రాత్రి ఇక్కడెవరున్నారోయ్ బాయ్" అని సందేహం లాంటి గొణుగుడుని వెలిబుచ్చాడు. " ఆరింటికే ఆళ్ళ షిఫ్ట్ మారిందండి " అంటూ వెళ్ళిపోయాడు బాయ్.

ప్రాణం ఉసూరుమంది రాంబాబుకి. ఏదో ఆలోచిస్తూ— ఏమీ చెయ్యలేక— సూట్‌కేస్ తీసి వో వంద తీసి సంతోషంకిచ్చి "మన పని కాస్త త్వరగా అయ్యేట్టు చూడండి గురూగారూ" అని అర్థించాడు.

" ఏం భయంలేదు. అట్టాగే " అని అభయమిచ్చి పచ్చ కాగితాన్ని జేబులో కుక్కుకుని ఏదో పాట హమ్మింగ్ చేస్తూ వెళ్ళిపోయాడు సంతోషం. వెళ్తూ వెళ్తూ "సాయంత్రం ఆరింటికి కలుస్తా. రూమ్‌లో వుండు." అని వెళ్ళాడు.

రాంబాబు మనసు చెడిపోయింది. రెండొందలు కార్లకీ బార్లకీ ఖర్చయిన దానికన్నా ఉట్టిపుడియంగా వంద రూపాయలు ఎక్కడో జారిపోయినందుకు బాధ మొదలైంది. చెల్లెలు తెమ్మన్న పట్టుపరికిణీ డబ్బు పోయినట్లనిపించింది.

వంద రూపాయలు పోయిన కారణాన టిఫిన్ చెయ్యాలనిపించలేదు రాంబాబుకి. కౌంటర్‌దాకా వెళ్ళి హోటల్ వాళ్ళతో జగడా పడ్డాడు—బాయ్స్‌లో ఎవరో రాత్రి తన జేబు కొట్టేశారంటూ.

"హాఁయ్...అమ్మ...ఎంతమాట" అని కట్టగట్టుకుని మీదపడి రాంబాబుని కొట్టబోయారు బాయిస్. నలుగురిలో ఓ కుర్రాడు రాంబాబుని హెచ్చరించాడు, "నీ బోడి వంద రూపాయలకి కక్కుర్తిపడే వాళ్ళెవరూ లేరు లేవయ్యా మా బాయిస్‌లో—మాకు రోజుకి రెండొందలు టిప్పే వస్తయ్" అన్నాడు.

నలుగురూ నవ్వేరు. బిక్కచచ్చిపోయాడు రాంబాబు. గోళ్ళు కొరుక్కున్నాడు. తల కొట్టేసినట్లయింది. మరొకతనేమో "తెగిపోయిన చెప్పుల్తో తిరిగే మొహానికి అసలు వచ్చనోటు తెలుసా ?" అన్నాడు ఎద్దేవగా. రాంబాబు మొహం మిల్లిలా అయిపోయింది. రూమ్‌లో జొరపడి జుట్టు పీక్కున్నాడు. అవమానంగా ఫీలయ్యాడు. పాట పాడుకోవాలని ట్రై చేశాడు.

ఏ ఒక్క పాటకీ ట్యూనూ రాలేదు. మంచంమీద దొర్లి దొర్లి నిద్రపోయాడు.

సాయంత్రం అరయింది. కడుపు రగిలిపోతోంది రాంబాబుకి. కడుపు కాలిపోతోంది. ఉదయాన్నుంచీ ఏఁవీ తినలేదు మరి.

ఇంతలో సంతోషం వచ్చేడు. జరిగిందంతా రిసెప్షన్‌లోనే తెలిసిపోయిందతనికి. రాంబాబుమీద చిరచిరలాడేడు. "వెధవ వొందకి ఇంత గొడవెందుకు" అన్నాడు.

"అది నాది కదా-అందుకూ" అని లోలోపలే ఏడ్చేడు రాంబాబు.

"నీ వలన నాకు చిన్నతనంగా వుంది. పద-రూమ్ ఖాళీ చెయ్" అంటూ రాంబాబుని బయట పడేశాడు సంతోషం.

అప్పట్నుంచీ, ఆనందాకు మారింది బస.

ఆ రాత్రి కూడా—గడచిన రాత్రి ఆనందాన్నే కొనుక్కున్నారు గురుశిష్యులు. కాకుంటే "అమ్మో రెండొందల ఇరవయ్యే" అని గుండెలు బాదుకున్నాడు రాంబాబు. "పోనీవోయ్ ఏది శాశ్వతం. నువ్విట్టా ఏడుస్తుంటే నీ కడుపులో చికెన్ మరింత గలభా చేస్తుంది" అని భయపెట్టాడు సంతోషం.

"హతవిధీ, దుర్విధీ; ఖర్మ, దుష్కర్మ; హ్రీం గ్రీం, గ్రీం హ్రీం" అనుకుని స్వగతంలోనే నెత్తీ నోరూ కొట్టుకుని కొత్తగా కొన్న చెప్పులు నేలకేసి రాస్తూ ఆటో ఎక్కాడు రాంబాబు.

మర్నాడు, ఆ తర్వాత రెండు రోజులూ శిష్యుణ్ణి కూడా తనతో తిప్పేడు సంతోషం.

నగరంలోని మనవాళ్ళలో చాలామందిని చూపించాడు. కొన్నిచోట్ల టీలూ ఒకటి రెండు చోట్ల డ్రింక్‌లూ దక్కినై. పనిలో పనిగా సిటీని చూశాడు రాంబాబు. అతనికి గుండెల్లో గుబులుగా వుంది. ఈ జనారణ్యంలోకీ, మహాసముద్రంలోకీ పన్నుకాగితాల పడవల్ని వదులుతున్నకొద్దీ, అవన్నీ ప్రతిఫలం లేకుండా మునిగిపోతున్నకొద్దీ దిగులు దిగులుగా నీరసం ఆవహించసాగింది.

మరో నాలుగు రోజుల తర్వాత, రూమ్‌లో ఉద్యోగ ప్రస్తావన తెచ్చాడు రాంబాబు.

సంతోషం ఆముదం మొహంపెట్టి "నీ bad luck రాంబాబూ. అంతా సెటిలయిపోయి టరమ్స్ కుదిరే సమయంలో గద్ద తన్నుకుపోయిందివ్వాళ."

ప్రాణం హరీమన్నట్టయింది రాంబాబుకు. తమాయించు కున్నాడు. "అంటే ?"

"అంటే ఆ గద్ద మనకంటే పెద్దది. మినిష్టరుగారి ఇలాకా మరి. డోన్ట్‌వర్రీ నీకేం ఫర్లే. మనవాళ్ళున్నారు. నే నున్నాను. చూద్దాం" భరోసా ఇచ్చేడు.

"కానీ, డబ్బులయిపోవస్తున్నాయ్..." న సి గే డు రాంబాబు.

"నోవర్రీ. ఈలోగా నేనా మిఠాయి పొట్లాన్ని పట్టుకొచ్చి నీ చేతి కిస్తాగా" ధైర్యం చెప్పేడు.

కొంచెం ఊపిరాడింది—రాంబాబుకి.

ఆ తర్వాత వారం రోజులపాటు సంతోషం అయిపు లేడు. తెలిసినచోటల్లా విచారించాడుగానీ, రాంబాబుకి అతని అడ్రస్ దొరకలేదు. సూట్ కేస్‌లో కాగితం కవరు బరువు తగ్గుతున్న కొద్దీ రాంబాబు గుండె బరువెక్కుతున్నది. అన్నం తింటుంటే పల్లెలో వున్న అమ్మా, చెల్లీ గుర్తుకొస్తున్నారు అతనికి. పోయింది పోగా మిగిలిన కుంటని అమ్మేసి ఆరువేలూ ఇచ్చి ఈ సంతోషంతో పంపించింది అమ్మ. "నాలుగు రోజుల్లో నీ కొడుక్కి ఉద్యోగం చూపించే భారం, బాధ్యతా నాది" అంటే ఆశగా తనని సంతోషంతో ప్రయాణం కట్టించింది అమ్మ. రాత్రుళ్ళు కొండ చిలువలాంటి భయం అతనిముందు ప్రత్యక్షమై నిద్ర పట్టకుండా చేస్తోంది. ఈ డబ్బు అయిపోయి ఉద్యోగం రాకపోతే— "అమ్మో" ఈ ఆలోచనకే గుండెలు అవిసిపోతున్నై రాంబాబుకు. ఉద్యోగం రాకపోతే—తిండి వుండదు తనకొక్కడికే కాదు అమ్మకూ, చెల్లికీ కూడా. ఉద్యోగం రాకపోతే వసంత—తన వసంతని తన కివ్వడు మామయ్య. ఆలోచనలకు చిక్కిపోతున్నాడు రాంబాబు. ఈ ఆలోచనలతో చిక్కిపోతున్నాడు రాంబాబు.

ఆ రాత్రి హడావిడిగా ఊడిపడ్డాడు సంతోషం. "ప్రశ్న లేఁవీ వెయ్యకు. నే చెప్పేది విను" అంటూ "నీ రొట్టి విరిగి నేతిలో పడిందోయ్." అని రాంబాబు చేయందుకున్నాడు.

'నేతిలో పడకపోతే మానె కుడితిలో పడకుంటే చాలు. రొట్టె రొట్టెగా దొరికితే అదే పదివేలు'—ఇదీ రాంబాబు మనసులో మాట.

"ఎల్లుండి వో కంపెనీలో ఇంటర్వ్యూలున్నై. దానికి నీకు కాల్ లెటరొచ్చే ఏర్పాటు చేస్తున్నాను. కుందేటి కొమ్మని సాధించినట్లయిందనుకో, కాకుంటే ఓ రెండువేలు అర్పించు కోవాలి."

"అమ్మో రెండు వేలే" అప్రయత్నంగా అరిచాడు రాంబాబు పడిపోబోయి మంచంమీద కూలబడ్డాడు.

"ఏఁవిటోయ్ ఆ గావుకేక. రెండువేలంటే డామ్ చీప్ తెలుసా, వేలం పాడుతున్నారు. నాకు కనక ఈ మాత్రానికి దొరికింది."

"అఁహఁహఁ ... కాబోలు ... అవునవును ... అయ్యే వుంటుంది" అని తడబడి నీళ్ళు నమిలేడు. కొద్దిసేపటికి తెప్పరిల్లి కుని రెండువేలూ అతనికిచ్చి "గురూగారూ భారమంతా మీదే. ఏం చేస్తారో ఏమో" అని చేతులు పుచ్చుకుని కళ్ళనీళ్ళు పెట్టు కున్నాడు. మళ్ళీ "డోన్ట్‌వర్రీ" చెప్పి డబ్బు తీసుకుపోయాడు సంతోషం.

మర్నాడు వైర్‌మీద కాల్ లెటరొచ్చింది. సంతోషం రాలేదు.

రాంబాబు పొంగిపోయాడు. సంతోషం తెలివికీ, చాకచక్యా నికీ, లౌక్యానికీ ధన్యవాద తీర్మానాలు కోకొల్లలుగా పాస్ చేశాడు. పాలకోవా తిన్నాడు. తల్లికీ చెల్లికీ అదే స్వీట్ రెండు కిలోలు తీసుకుపోవాలనుకున్నాడు. అతనికి లోకమంతా ఆకుపచ్చగా

కనిపించసాగింది. మనస్సు చార్మినార్ ఎక్కి తాజ్‌మహల్ ముందు విహరించసాగింది. ఊహలు కాళ్ళని ఢిల్లీ, బొంబాయి, కలకత్తాల్లో తిప్పసాగినై. ఆశని పీకలుమొయ్యా మేసేసి, ఊహాగానాన్ని గొంతెత్తి గానం చేసుకుని ఆలోచనల పండగ చేసుకున్నాడు. ఆ రోజల్లా ఈలపాటల్లోనే తేలిపోయాడు. పెద్ద చిన్నదాని కళ్ళని వసంత కళ్ళతో "రీప్లేస్" చేసుకుని—ఉత్సవాల ఊరేగింపు జరుపుకున్నాడు. రాత్రికి గురువుగారు లేకుండానే తనొక్కడే గుర్రమెక్కేడు.

మర్నాడు ఇంటర్వ్యూకి హాజరయ్యాడు రాంబాబు. "పసుపు పచ్చలో నీలం కలిస్తే ఏ రంగొస్తుంది", "మీ వూళ్ళో వున్న వీధి దీపాల సంఖ్య ఎంత?" వంటి ప్రశ్నలు వేసి "నాకు తెలీదు" అనిపించి పంపించారు. రాంబాబుకి ఏడుపు ముంచుకొచ్చింది. చెట్టునవున్న మామిడికాయని కష్టపడి రాయితో కొట్టుకుంటే—అది మురుక్కాలవలో పడినట్లైంది. మళ్ళీ సంతోషం అడ్రస్ లేదు.

మరో రెండ్రోజుల్లో సూట్‌కేస్‌లోని కాగితం కవరు ఖాళీ అయింది.

ఆవేళ హోటల్ ఖాళీ చేయాలి. ఇంటర్వ్యూ జరిగిన కంపెనీకి పోయి విచారిస్తే ఖాళీలు భర్తీ చేశామని చెప్పారు. రాంబాబు బంగారు హర్మ్యాలన్నీ పేకమేడలైనై. తిట్టిన తిట్టు తిట్టకుండా సంతోషంని తిట్టాడు. తనను తాను తిట్టుకున్నాడు. ఇద్దర్నీ కలిపి తిట్టుకున్నాడు. సంతోషం చెప్పిన శుష్కప్రియాలతో, తనకు మిగిలిన శూన్య హస్తాలతో పల్లెకి తిరిగొచ్చాడు.

జరిగిందంతా తల్లితో చెప్పి ఏడ్చాడు.

"పోన్లె ఏం చేస్తాం ఖర్మ. మనకింకా మంచిరోజులు రాలేదు" అని పిడకలు చేసుకోవడానికి పోయింది ఆవిడ. మూగగా మౌనంగా చెల్లెలేమో గడ్డి కోసుకురావడానికి తట్ట తీసుకుని గట్టుకి వెళ్ళిపోయింది.

నెలరోజులకి కాబోలు సంతోషంనుంచీ ఉత్తరం వచ్చింది. రాంబాబు ఇంటర్వ్యూలో బాగా చేయకపోవడం దురదృష్టమనీ అతనికి ఉద్యోగం రాకపోయినందుకు తాను ఎంతో విచారిస్తున్నాననీ వ్రాసేడు. ఆ ఉత్తరాన్ని చించి పోగులుపెట్టి రోషంతో ఉక్రోషంతో పెదవులు వణికించుకున్నాడు రాంబాబు.

మరో నెలకి—రాంబాబుకి తన మావయ్య నుంచీ పెళ్ళి శుభలేఖ వచ్చింది. వధువు తనదనుకున్న వసంత ! వరుడు సంతోషం ! అతని పేరుకింద ఉద్యోగ వివరం వేసి వుంది. అవును, అది రాంబాబు ఇంటర్వ్యూకి వెళ్ళిన కంపెనీ పేరే ! ! పెద్దచిన్నదాని చూపులు రాంబాబు కళ్ళముందు వర్తించినై.

గుండెలు పిండుకుని అలిసిపోయిన రాంబాబు భ్రష్టయోగిలా నవ్వుకున్నాడు. ఆ వెంటనే అతని పెదవులు హీనంగా, దీనంగా ఛీత్కారంగా గొణుక్కున్నై—"ఛీ...ఛీ...అంతా మనవాళ్లు—ఆడిందేమో డర్టీగేమ్ !"

0⁰0